# జనానా

వెంకటరమణశాస్త్రి సద్బ్రాహ్మణ కుటుంబానికి చెందినవాడు. అయితే అతనికి చిన్నప్పుడు మృదంగం నేర్చుకోవాలనే కుతూహలం వుండేది. ఆ కుతూహలంతో, అన్న చెపుతున్నా వినక దక్షిణాది వెళ్ళి పది సంవత్సరాలు గురు శుశ్రూషచేసి నేర్చుకున్నాడు; మృదంగం బాగానే వాయిస్తాడు. కాని బుద్ధిలో వున్న పెంకెతనంవల్ల, పాడే సంగీత విద్వాంసునికి మధ్యమధ్య పెడతిరుగుతూ వుంటాడు. అందువల్ల, సకృత్తుగా తప్ప ఏగొప్ప సంగీత విద్వాంసుడూ అతనిని తన పాటకచ్చేరికి పిలిపించేవాడు కాదు. పిలిపించిన వారికి సభ పూర్తి అయ్యేవరకూ, ప్రాణాలు కొట్టుకుంటూనే వుండేవి.

అయితే మనిషి చెడువాడా అంటే, కాదు. ఇప్పటికీ స్నానంచేసి, మొహానికి గంధంరాసి, కుంకుమబొట్టు పెడితే బ్రహ్మవర్చస్సు ఉట్టిపడుతూ వుంటుంది. అతని అరవయ్యో పడిలో అతనికీ నాకూ పరిచయం అయింది. అప్పటికి అతను ప్రభుత్వంవారు స్థాపించిన సంగీత విద్యాలయంలో 'మృదంగిస్టు'గా వుంటున్నాడు. నేను దానికి దగ్గర్లో వున్న హైస్కూల్లో మాష్టరుగా వుంటూవుండేవాణ్ణి. నేను మొదటినుంచీ ఆ హైస్కూల్లో మాష్టరును కాదు. మరొక స్కూలు నుంచి అక్కడికి ట్రాన్స్ఫర్ అయ్యాను.

ఒకరోజు వెంకటరమణశాస్త్రి 'దినపత్రికవుంటే ఒకసారి ఇస్తారూ' అంటూ నా గదికి వచ్చాడు. ఇచ్చాను. కూర్చుని తీరికగా చదువుకొని వెళ్ళిపోయాడు. ఆ రోజు మొదలుకొని రోజూ పత్రిక చదువుకోటానికి

వస్తూండేవాడు. ఈ విధంగా పరిచయం అయి, ఆ పరిచయం క్రమ క్రమేణా స్నేహంగా వృద్ధిచెందింది.

వెంకటరమణశాస్త్రికి వేదాంతంలో కొద్దిగా పరిచయం వుంది. నా కప్పుడు సర్వీస్‌లో రావలసిన ప్రమోషన్ రాక, కాస్త వేదాంత దృష్టి అలవడివుంది. అందువల్ల పత్రికల్లోవున్న విషయాలతోపాటు వేదాంతాన్ని గురించి మేము యెక్కువగా మాట్లాడుకుంటూవుండేవాళ్ళం. వేదాంత విషయః యేది చర్చకువచ్చినా నశ్యం తానింత తీసుకొని, నాకొక పట్టు యిచ్చి, పీల్చి, నన్ను పీల్చమని సంభాషణకు వుపక్రమించేవాడు.

అతను వేదాంతలో కృషి చెయ్యకపోయినా, వంశపారంపర్యా వచ్చిన జ్ఞానంవల్లా, అనుభవంవల్లా వేదాంతంలో వొకస్థాయికి వచ్చిన మనిషి. నాకు చదవటానికైతే చాలా పుస్తకాలు చదివానుగాని; అనుభవం అనుష్ఠానం తక్కువ. అందువల్ల మా సంభాషణ ఒకరికొకరికి సహాయకారిగా వుండేది. పరిచయం అయిన కొద్దిరోజులకే, మా స్నేహం దృఢపడటానికి యిది ముఖ్యకారణం.

ఒకరోజున అతను మామూలుగా నా గదికి వచ్చి ఆనాటి దిన పత్రిక అడిగాడు. నేనిచ్చాను.

అతను పత్రిక పేజీలు తిరగవేస్తూ, ఒకచోట ఆగి "పాపం," అని వొక పెద్ద నిట్టూర్పు విడిచాడు.

"ఏమిటి సంగతి?" అని నేను అడిగాను.

"మహమ్మదల్లీసాహెబుగారు మరణించారు. చూడలేదా?" అన్నాడు శాస్త్రి.

ఆ వార్త నేను చూశాను. కాని అంత విలువ ఇవ్వలేదు. అతను ఆ వార్తకు యెందుకు అంతవిలువ ఇస్తున్నాడో కూడా నాకు అర్థం కాలేదు.

మహమ్మదల్లీసాహేబుగారు ఒక పెద్ద జాగీర్దారు కొడుకు. అప్పుడు మేము ఉంటున్న వూరు ఆ జాగీర్లోదే. ఇటీవల ఆ జాగీర్ని ప్రభుత్వం తన వరం చేసుకుంది. అయితే అతని మరణానికి వెంకటరమణశాస్త్రి విచారపడటం దేనికి? ఈ మాటే అతన్ని అడిగాను.

"నేను ఆయన కొలువులో కొన్నాళ్ళు మృదంగం వాయించాను. చాలా మంచిమనిషి" అన్నాడు.

మహమ్మదల్లీసాహేబు మంచి మనిషని అనగా వినటం నాకదే మొదటిసారి. ఆయనకూ, ఆయన తండ్రిగారికీ ప్రజల్లో ఏమాత్రం మంచి పేరు లేదు. వారు చేసిన దౌర్జన్యాలను గురించీ, వారి జనానాలను గురించీ, ప్రజలు చిత్ర విచిత్రమైన కథలు చెప్పుకోవటం నేను యెరుగుదును. అటువంటి మహమ్మదల్లీసాహేబుని మంచి మనిషి అంటున్నాడు వెంకటరమణశాస్త్రి. శాస్త్రి తేలిగ్గా అభిప్రాయాలను ఏర్పరచుకునే మనిషికూడా కాదు. విషయం సమగ్రంగా తెలుసుకోవాలనిపించింది నాకు.

"నువ్వు ఆయన కొలువులో ఉద్యోగం సంపాదించటం, యెలా సంభవించింది?" అని అడిగాను.

ఆయన నెమ్మది నెమ్మదిగా కథంతా చెప్పాడు.

ఆ రోజుల్లో వెంకటరమణశాస్త్రి మృదంగం విద్య నేర్చుకొని ఏ పనీపాటా లేకుండా తిరుగుతూండేవాడు. అన్నగారి మంకుతనంవల్లా, తన దిమ్మరితనంవల్లా వున్న ఆస్తి అడుగంటింది. అప్పటికే అతనికి నలుగురు పిల్లలు. అందులో భార్య కొంచెం రజోగుణం గలది అవటంవల్ల యింట్లో ఉండటం క్షణ క్షణ గండంగా పరిణమించింది. శాస్త్రిది అసలు సర్కారు జిల్లాలో ఒక కుగ్రామం. సర్కారుజిల్లాల్లో అతనికి పరిచయులూ స్నేహితులూ చాలామంది వున్నారు. కాని ఏ ఒక్కరూ అతనికి సహాయం చెయ్యలేకపోయారు.

సర్కారుజిల్లాల్లో ఉద్యోగం దొరకనివారు హైదరాబాద్ వెళ్ళటం రివాజు. అదే విధంగా వెళ్ళాడు వెంకటరమణశాస్త్రి. అక్కడ ఆయన తిరగ్గా తిరగ్గా తనలాగే వచ్చి ఉద్యోగం సంపాదించుకొని, సుఖంగా జీవయాత్ర సాగిస్తున్న ఒక పాత చుట్టం కనిపించాడు. ఆయన మహమ్మదల్లీ సాహేబుగారి దగ్గర మేనేజరుగా వున్నాయనను యెరుగును. వెంకటరమణశాస్త్రిని ఆయన దగ్గరకు తీసుకొని వెళ్ళాడు.

అప్పటికి యింకా హైదరాబాద్ భారత ప్రభుత్వం క్రిందకురాలేదు. నైజామే పరిపాలిస్తూ ఉండేవాడు. జాగీర్దార్ల పని అతి వైభవంగా ఉండేది. మహమ్మదల్లీ సాహేబుగారి తండ్రి బంజారా కొండలమీద ఉండేవారు. మహమ్మదల్లీసాహేబు సైఫాబాద్‌లో వొకపెద్ద భవనంలో ఉంటూ వుండేవాడు. వారానికి వొకసారి వుదయం వెళ్ళి, తండ్రితో భోజనంచేసి వస్తుండేవాడు. అంతకంటే ఆయనకూ, తండ్రికీ ఎటువంటి సంబంధమూ వుండేది కాదు. ఎవ్వరి జీవితం వారిదిగా వుండేది. అయితే తండ్రి కుమారునికి నెలకు యింతని డబ్బుమాత్రం పంపుతూ వుండేవారు. మహమ్మదల్లీగారు ఆ డబ్బూ సొంత ఆస్తిమీద వచ్చే డబ్బూ ఖర్చుపెట్టటమే గాక, అప్పు కూడా చేస్తూ వుండేవారు. ఇతర ఖర్చులమాట అటుంచి జనానాలో వంద మంది వుంటూ వుండేవారు. రెండువందలకు పైగా గుర్రాలూ, ఏనుగులూ వుండేవి. మద్యపానం, నృత్య సంగీతాలూ అహర్నిశలూ జరుగుతూ వుండేవి. ఆయన భవనం, ఒక ఇంద్రభవనంగా వుండేది.

ఇవన్నీ హైద్రాబాద్‌లో ఆబాలగోపాలానికితెలుసు. హైద్రాబాద్‌లో అడుగుపెట్టిన కొద్ది గంటలకే ఈ విషయాలన్నీ వెంకటరమణశాస్త్రి చెవికెక్కినై. మామూలు పరిస్థితుల్లో అయితే అటువంటి మహమ్మదల్లీ సాహేబు దగ్గర పనిచెయ్యటానికి వెంకటరమణశాస్త్రి అంగీకరించి వుండేవాడు కాదు. కాని యిప్పుడు ఏదో ఒక ఉద్యోగం చెయ్యటం కంటే గత్యంతరం లేక అంగీకరించాడు.

మంచిరోజు చూచి వెంకటరమణశాస్త్రిని ఆ పాత బంధువు, మేనేజరు దగ్గరకు తీసుకువెళ్ళాడు. మేనేజరు మహమ్మదల్లీ సాహేబుగారి

దగ్గరకు తీసుకుపెళ్ళాడు. వెంకటరమణశాస్త్రి వాయిద్య నైపుణ్యం, ఉన్న దానికంటే వెయ్యిరెట్లు ఘనతగా చెప్పాడు. మహమ్మదల్లి సాహేబుగారు వెంకటరమణశాస్త్రిని మరునాటినుంచీ ఉద్యోగంలో చేరమన్నారు. రోజూ సాయంకాలం ఆరు గంటలకు వచ్చి తొమ్మిది గంటలకు వెళ్ళిపొమ్మన్నారు.

మరునాడు వెంకటరమణశాస్త్రి కొలువులో ప్రవేశించాడు. కాని పనేమీ వుండేది కాదు. ఏ కాసేపో, గుణం కుదిరితే, మృదంగం వాయించమనేవాడు. మహమ్మదల్లి సాహేబుగారికి ఖైర్వా వరుసలు ఇష్టం. అవే వాయించమనే వాడు. కాని మృదంగం తాను వాయిస్తున్నప్పుడల్లా తలుపు ప్రక్కనుంచి ఒక యువతి ఆపేక్షగా వింటూ వుండడం అతను గమనించకపోలేదు. ఆమెపేరు మనోహరి. జనానాలో వుండే యువతుల్లో ఆమెఒకతె. మహమ్మదల్లి సాహేబుగారికి చాలా ఇష్టురాలని ప్రతీతి.

అలా జరిగిపోయినై కొన్నిరోజులు. రోజులు గడిచిన కొద్దీ మహమ్మదల్లి సాహేబుగారితో వెంకటరమణశాస్త్రికి బాగా చనువు యేర్పడింది. అలా చనువు యేర్పడడానికి వేదాంతం తోడ్పడింది. మహమ్మదల్లి సాహేబుగారికి హిందూ వేదాంతం అంటే యిష్టం. అందుకని యేవేవో ప్రశ్నలు వేస్తూ వుండేవారు. భాగవతంలోని పద్యాలు చదివించుకొని సంతోషిస్తూ వుండేవారు. వారి భవనం ప్రక్కన వున్న రామాలయానికి ధూప దీప నైవేద్యాలకు ఖర్చు మహమ్మదల్లి సాహేబుగారే భరిస్తూ వుండేవారు.

అప్పుడప్పుడూ తన సొంత విషయాలుకూడా చెపుతూ వుండేవారు. ఆ మధ్య తండ్రిగారికి, ఆయనకూ పొరపులు వొచ్చినై. జాగీర్లు యెక్కువ కాలం వుండవని తెలుసుకొని తండ్రిగారు చాలా డబ్బు పోగుజేసారు. ఖర్చంతా తగ్గించి వేశారు. తనదగ్గరవున్న దాసదాసీ జనానికి వివాహాలుచేసి పంపించివేశారు. కుమారుడుకూడా అదేవిధంగా చెయ్యాలని వారి ఉద్దేశం. కాని మహమ్మదల్లి సాహేబుగారు అందుకు వొప్పుకోలేదు. దానితో నెల

నెలకూ వారిచ్చే డబ్బు మానివేస్తారని తండ్రిగారు బెదిరించారు. ఇటు వంటి విషయాలన్నీ శాస్త్రీకి చెపుతూ వుండేవారు.

"మా తండ్రి రక్తంలో జాగీర్దారీ రక్తం లేదు. ఒట్టి కోమటి. మా తండ్రిగారి చిన్నతనంలో మా తాతగారు వారిని వొక ఉత్సవానికి వెంట తీసుకువెళ్ళారు. ఊరేగింపు సమయంలో మా తండ్రిగారి జేబురుమాలు క్రింద పడింది. ఆయన దాన్ని తీసుకుని మళ్ళీ జేబులో పెట్టుకున్నారు. అందుకు మా తాతగారికి కోపంవచ్చి వీడు జాగీరు పరిపాలించడానికి అర్హుడు కాడని చెప్పి రాజధాని బయట వొక భవనం కట్టించి అందులో పెట్టారు" అని చెప్పేశారు

"మరి తండ్రిగారు పరిపాలనకు యెలా వచ్చారు హుజూర్?" అని అడిగాడు వెంకటరమణశాస్త్రి.

"మంత్రిగారి సహాయంతో శాస్త్రీజీ" అన్నారు మహమ్మదల్లి సాహేబుగారు, ఇంకా యిలా చెప్పారు. "మా తాతగారికి మామూలు భార్యల సంగతి అటుంచి, ముఖ్యులు ఇద్దరు వుండేవారు. అందులో పెద్ద భార్య సంతానం మా తండ్రిగారు రెండవ భార్యకు ఇద్దరు కుమారులు వున్నారు. వారు చాలా దర్పం గలవారు. అందులో పెద్దవారు నిజంగా పరిపాలనకు అర్హులు. తన తరువాత జాగీరు పరిపాలనకు వాడురావాలనే మా తాతగారి అభిలాష. కాని మా తాతగారి అనంతరం. మంత్రిగారు మాతండ్రిగారివద్ద చాలాడబ్బు తీసుకొని, మా తాతగారి కోర్కెకు వ్యతిరేకంగా, వారు వ్రాసిన ఫర్మానాను మాఫ్‌చేసి మా తండ్రిగారని గద్దె యెక్కించారు."

"మరి మీ తాతగారి రెండవ భార్య కుమారులు ఇప్పుడేం చేస్తున్నారు హుజూర్?" అని ధైర్యం చేసి అడిగాడు శాస్త్రి.

"పీధులు బట్టుకు తిరుగుతున్నారు శాస్త్రీజీ. మా తండ్రిగారు కోమటి అని చెప్పాను గదా, వారికి ఏమీ ముట్టకుండా చేశారు. అప్పు డప్పుడూ నేనే వారికి కొద్దీ గొప్పా డబ్బు పంపుతూ వుంటాను. ఈ

సంగతి తెలిస్తే మా తండ్రిగారు వూరుకోరు. నాకిచ్చే డబ్బుకూడా ఆపు చేస్తారు. అందుకని ఈ విషయం రహస్యంగా వుంచాను. ఆ బిడ్డలుకూడా మా తండ్రిగారి తోటివాళ్ళేగదా. వారిని అలా చెయ్యటం అన్యాయం చెయ్యటం. కాదా శాస్త్రిజీ? భగవంతుడు వూరుకుంటాడా?" అని అడిగారు మహమ్మదల్లి సాయిబుగారు.

ఏమంటే ఏమవుతుందో నని "భగవంతుని లీలను గ్రహించడం కష్టం హుజూర్" అన్నాడు శాస్త్రి.

మహమ్మదల్లి సాహేబుగారు కాసేపు మౌనంగా కూర్చున్నాడు. చివరికి, "ఏదైనా మా తండ్రిగారిలో జాగీర్దారులరక్తంలేదు. ఆయన వొట్టి కోమటి. కోమటని నేను మాటవరసకు అనటంలేదుశాస్త్రిజీ. మాముత్తవకు అసలు పిల్లలు లేరని, అందువల్ల జాగీరుతనేసవతిపిల్లలకు ఎక్కడవెళ్తుందో అని భయపడి, ఎవ్వరికీ, చివరికి మా తాతగారి క్కూడా తెలియకుండా కోమట్లపసిపాపను తెచ్చుకొని తనకు పుట్టిన పిల్లవాడుగా నటించి పెంచిందన్నీ వొక ప్రబలమైన వదంతి వుంది. మా తండ్రిగారి చర్యలు చూస్తుంటే యిది నిజమేనేమో నని అనిపిస్తూంది శాస్త్రిజీ" అన్నారు.

శాస్త్రిజీ మహమ్మదల్లి సాహేబు తండ్రిగారి పిసినిగొట్టుతనాన్ని గురించి అంతకుముందే అనేక కథలు వినివున్నాడు. ఆ మాటకొస్తే హైదరాబాదులో ఈ విషయం తెలియని పౌరుడంటూలేడు. వారు బేడకు పది సిగరెట్లు ఇచ్చే చార్మినార్ సిగరెట్లుమాత్రమే త్రాగుతారు. వాటిని కూడా చౌకఅని ఫ్యాక్టరీనుంచి పెద్దమొత్తంగా వొకేసారితెప్పిస్తారు. కుడితి నీలు చిరిగితే, అవే కుట్టించుకుని తొడుగుకుంటారు; మిషన్ వాడి దగ్గరకు పంపితే, కను చాటవటంవల్ల సరిగ్గా కుట్టడేమోనని, మిషన్‌వాడిని మిషన్‌తో సహా పిలిపించి తన ప్రత్యేక పర్యవేక్షణ క్రింద చిరుగులు కుట్టించి తొడుక్కుంటారు. అంతేకాదు. తన క్రిందవున్న చిన్న చిన్న జాగీర్దారు లందరూ చార్మినార్ సిగిరెట్లే త్రాగాలని, ఖరీదుగల బట్టలు కుట్టించుకో గూడదని, యెవ్వరూ విలాసార్థం జాగీరు దాటి బయటకు వెళ్ళి డబ్బు ఖర్చు పెట్టగూడదనీ వొక ఫర్మానాకూడా దయచేయించారు. యిటువంటి

విషయాలు చాలా విన్నాడు శాస్త్రి. కానీ మహమ్మదల్లి సాహేబుగారి తండ్రిగారు కోమట్లపిల్లవాడని వినటం అప్పుడే. అదీ వారి కుమారుని నోటినుంచి వినేటప్పటికి నిర్విణ్ణు డయ్యాడు.

"అది సంభవమా హుజూర్?" అని అడిగాడు. నిజంగా హుజూర్ వారిని అలా అడగగూడదు. కొత్తగనక ధైర్యంచేసి అడిగాడు శాస్త్రి.

"ఏది?"

"మీ తండ్రిగారి జనన వృత్తాంతం."

"జనానాసంగతి మీకు తెలియదు శాస్త్రిజీ! మీ ఆచారాలకూ మా ఆచారాలకూ చాలా తేడా వుంటుంది. ఇప్పుడు నా జనానాలో వందమంది స్త్రీలున్నారు. అందరూ వయస్సులో వున్నవారే. వారందరూ ఏంచేస్తున్నదీ అసలు జనానాలో ఏం జరుగుతున్నదీ నాకు తెలుస్తుందంటావా? ఈ తెలుసుకోటానికి నేను ఎవ్వరిమీదో ఒకరిమీద ఆధారపడాలి. అతడు నిజం చెపుతాడని నమ్మకం ఏముందీ? తన వ్యక్తిగత ద్వేషం తీర్చుకోటానికి ఎవ్వరిమీదో ఒకరిమీద కల్పించి అబద్ధాలు చెప్పవచ్చు. నిజం సునాయాసంగా కప్పిపుచ్చవచ్చు. అబద్ధాన్ని నిజంగా ప్రదర్శించవచ్చు. అంతేనంటావా శాస్త్రిజీ!" అన్నాడు మహమ్మదల్లి సాహెబుగారు.

శాస్త్రి ఏం చెప్పగలడు? "కొంత వరకు అంతే హుజూర్" అన్నాడు.

"ఇక మా బేగంసాహెబాల సంగతి. మీలో భార్యా భర్తలు కలిసి వున్నట్లు మేము ఉండం. ఉంటానికి వీల్లేదు. అడ్డుకునేవి ఏమి టంటావా? ధన మదా ధతే కావచ్చు.కారణం ఏదయినా కలిసి వుండం అనేది సత్యం. మేము వొక భవనంలో వుంటాం. బేగం సాహెబాలు మరొక భవనంలో వుంటారు. మేము వారి దగ్గరకు వెళ్ళాలంటే ముందుగా కబురుపెట్టాలి. ఏ కారణం వల్ల యినా బేగం సాహెబు 'వలదుపడదు' అంటే వూరుకోవలసిందే. ఇక అక్కడ ఏం జరుగుతున్నదీ మాకెలా తెలుస్తుంది? బేగం

సాహెబాలకు, వారికి వుండే పరివారం వారికివుంటుంది. ఇక ఆ పరివారంలో ఎవ్వరిమీదో ఆధారపడవలసి వస్తుంది; వారు నిజం చెపుతారనే నమ్మకం ఏముంది?

బేగం సాహేబాగారికి నెల తప్పింది అంటారు. పెద్ద పెట్టున ఉత్సవం జరుగుతుంది. నిజమే అనుకుంటాం. పోనీ, నిజమే అన్నట్లు నటిస్తాం.

బేగం సాహేబాగారు ప్రసవించింది_అంటారు. మొదటిసారికంటే పదిరెట్లు వైభవంగా ఉత్సవం జరుగుతుంది. సరే అనుకుంటాం. పోనీ, అనుకున్నట్లు నటిస్తాం.

ఏ డాక్టరునైనా పంపి నిజానిజాలు తెలుసుకుందాం అంటే, ఆ డాక్టరు నిజం చెపుతాడని నమ్మకం ఏముంది? ఆ డాక్టరుమీద మరొక వేగులవాణ్ని వెయ్యాలి. ఆ వేగులవాడు నిజం చెపుతాడని నమ్మకం ఏముంది? వాణ్ని కనిపెట్టి వుండమని మరొకన్ని పురమాయించాలి. ఇలా ఒక పెద్ద గొలుసు తయారవుతుంది. సత్యం దూరం అవుతూంటుంది. ఇంత గొలుసు తయారుచేసికొని మేము ఎక్కడ వుంటాం? యథాస్థానం లోనే వుంటాం. ఎవ్వరినో ఒకర్ని నమ్మవలసిన స్థితిలోనే వుంటాం. ఇక ఈవృధా శ్రమ ఎందుకు? బేగం సాహేబాగారి మాటే నమ్మిపోతేపోలా!"

"బాగా సెలవిచ్చారు హుజూర్." అన్నాడు శాస్త్రి దిక్కులు చూస్తూ.

"అందుకని మా తాతగారు బేగం సాహేబాగారి మాట నమ్మి వుంటారు."

"పోనీ నమ్మినట్లు నటించి వుంటారు?" అని మనస్సులో అను కున్నాడు శాస్త్రి. పైకి అనే ధైర్యంలేక మెదలకుండా కూర్చున్నాడు.

అతని మౌనం అపార్థం చేసుకొని, "జాగీర్దారు కుటుంబాలంటే మీరు ఏమిటో వూహించుకుంటారు. విషపూరిత వాతావరణం తప్ప ఏముం

టుందిక్కడ! విషపూరిత వాతావరణంలో వుంటూ ఎవ్వరికీ వాళ్ళం నేర్పుగా బ్రతకటమే మేము చేసేపని." అన్నారు.

ఈ విధంగా మహమ్మదల్లీ సాహేబుగారు, అనేక విషయాలు చెప్తూండేవారు శాస్త్రికి.

* * *

కాస్త వయస్సు మళ్ళిన వాడవటంవల్ల, శాస్త్రి అంటే మంచి నమ్మకం కుదిరింది మహమ్మదల్లి సాహేబుగారికి. పోనీ కుదిరిందనిశాస్త్రి అనుకున్నాడు. దానికీ కారణాలు వున్నాయి. మామూలుగా జనానాలో ఏ పురుషుణ్నీ వెళ్ళనివ్వరు. అటువంటిది శాస్త్రి ఎప్పుడుపడితే అప్పుడు వెళ్ళటానికి వీలుగా సాహెబుగారు హుకుంఇయచేశారు. ఎప్పుడు పడితే అప్పుడు, ఎక్కడపడితే అక్కడకు అతను వెళ్ళవచ్చు, రావచ్చు.ఎవ్వరూ ప్రశ్నించటానికి వీల్లేదు. తనక్రింద పనిచేసే వారెవ్వరూ మహమ్మదల్లీ సాహెబుగారిని నేరుగా చూడటానికి వీల్లేదు. ముందుగా మేనేజరుతో చెప్పు కొని వారిద్వారా పర్మిషన్ తెచ్చుకొని చూడాలి. ఇటువంటి నిబంధనలు శాస్త్రికి వర్తించేవి కావు. శాస్త్రి ఎప్పుడుపడితే అప్పుడు హుజూర్‌ని చూడవచ్చు. ఆయనకు ఏ అడ్డూలేదు.

జరిగినన్నాళ్ళూ ఈ ఉద్యోగం బాగానేవుంది శాస్త్రికి.సాయంకాలం ఆరుగంటలవరకూ సొంతపనులు ఏమన్నా వుంటే చూచుకొని హుజూర్ దగ్గరకు వెళ్ళేవాడు. తొమ్మిది గంటకు తిరిగి వచ్చేవాడు ఒకటవ తారీఖు వచ్చేటప్పటికి వందరూపాయలు ఇంటికి వచ్చేవి. ఇదే కాకుండా ఎక్కడి కన్నా వెళ్ళదలిస్తే ముందుగా హుజూర్‌కి నివేదించుకునేవాడు. హుజూర్ మరునాడు ఫలానా గంటలకు రమ్మనిచెప్పి మేనేజరుద్వారా ఖర్చులు ఇప్పించేవారు. పండుగలకూ, పబ్బాలకూ ఉప్పూ, పప్పూ ఇంటికివస్తూ వుండేవి. అప్పటికే చాలా కష్టాలుపడి వున్నాడేమో; జీవితాంతంవరకూ ఇలా జరిగితే చాలు అనుకున్నాడు శాస్త్రి. అయితే మహమ్మదల్లిగారి తండ్రికి ఎప్పుడుకోపంవచ్చి తాము కుమారునికి ఇస్తున్న డబ్బు ఆపి

వేస్తారో, ఎప్పుడు జాగీర్లు రద్దయిపోతవో అనే భయం ఒకటి అతన్ని వెన్నాడుతూ వుండేది. ఈ రెంటిలో ఏది జరిగినా మహమ్మదల్లి సాహేబు గారికి తనలాంటి ఉద్యోగస్థులను తగ్గించక తప్పదని అతనికి తెలుసు.

"హుజూర్ వున్నారా?" అని అడిగాడు శాస్త్రి ఒకరోజు గేట్లో కావలా కాస్తున్న పహరావాణ్ని.

ఆ పహరావాడు సలాంపెట్టి, "లేదు శాస్త్రిజీ, తండ్రి హుకుం అయితే చూట్టానికి వెళ్ళారు," అని చెప్పాడు.

శాస్త్రి తనగదిలోకి వెళ్ళికూచున్నాడు. ఏమీ తోచక మృదంగం బయటకు తీసి శృతిపెడుతూ కూర్చున్నాడు.

"శాస్త్రిజీ!" —అన్న పిలుపు చేరువగా వినిపించేటప్పటికి ఉలిక్కిపడి చూశాడు శాస్త్రి.

మనోహరి! మనోహరి అసలే అందగత్తె. అందులో చక్కగా ముస్తాబై వుంది. ధగధగ మెరిసిపోతూవుంది.

"ఇవ్వాళ మీ మృదంగం తీరిగ్గా విందామని వచ్చాను." అన్నది.

"మృదంగం కన్డిషన్లో వున్నట్లు లేదు," అన్నాడు శాస్త్రి, కాస్త తడబడుతూ.

"మీ వ్రేళ్ళు కన్డిషన్లో వున్నాయి గదా. అదేచాలు." అని అపహాస్యం చేసింది మనోహరి. "అవేచాలు" అని దిద్దుకుంది.

శాస్త్రికి తప్పలేదు. "ఏం వాయించమంటారు!" అని అడిగాడు.

"భైర్వా వరుస."

శాస్త్రి కొంచెం పస్తాయించాడు. ఆ వరుస ప్రభావం అతనికి తెలుసు. ఆ వరుస మగవాళ్ళకంటే ఆడవాళ్ళని ఎక్కువగా ఉద్రేక పరుస్తుందనేది అతని అనుభవంలోని సంగతి. ఆ వరుస వాయించినప్పుడే ఆమె తలుపు దగ్గర వుండి వింటూవుండేదనే సంగతి అతను మరచిపోలేదు.

"సంకోచిస్తారేం, శాస్త్రిజీ!"

శాస్త్రి మొదలుపెట్టాడు. మొదలుపెట్టినప్పుడు సంకోచమే గాని తరువాత తన్ను తాను మరచాడు. ఖైర్వా వరుస వినేవాళ్ళనే కాదు, వాయించేవాళ్ళనికూడా ఉద్రేక పరుస్తుందని తెలిసీ తన్నుతాను సంబాళించు కోలేక పోయాడు. గతి తరువాత గతి వాయించుకుంటూ పోతున్నాడు. మనోహరి ఆనందంలో తేలిపోతూ వుంది.

బయట వానచినుకులు పడుతున్నాయి. మనోహరి శరీరం ఒక్కసారి సువాసనలను విరజిమ్మింది. ఆమె లేతనడుము త్రాచుపాముకుమల్లే లయ బద్ధంగా మెలితిరుగ నారంభించింది. ఎటువడితే అటు విల్లుకుమల్లే ఒంగుతూ వుంది నడుం మీద గుడ్డపీలికన్నా లేదు. బొడ్డు తన లోతులను ప్రదర్శిస్తూ ప్రకటిస్తూ వ్యామోహ వీచికలను రేకెత్తిస్తూ వుంది.

శాస్త్రి దురితస్థాయిని అందుకున్నాడు. ఒళ్ళు మరచి వాయించాడు. అతని చేతిలోని మృదంగం శివునిచేతిలోని ఢమరుకవలె మ్రోగింది. మనోహరి దురితస్థాయిని అందుకుంది. ఒళ్ళు మరచి నృత్యం చేసింది. ఆమె శరీరం శ్రీరామ చంద్రునిచే మీటబడిన వింటినారివలె పడగలెత్తింది. చివరికి ఆమె అతని చేతుల్లో వాలింది. అప్పుడు శాస్త్రికి తెలివిరాలేదు. తెప్పరిల్లి తను చేసిన పొరపాటు గ్రహించి, "ఏమిటిది మనోహరీ?" అన్నాడు.

"ఏమున్నది? మీరు చొక్కా తీసివేసి మృదంగం వాయిస్తే ఒక్కసారి చూడాలని" అన్నది.

శాస్త్రి పైపంచె భుజాన వేసుకొని గది బయటకు నడిచాడు. వెనుకనించి మనోహరి కిలకిల నవ్వులు వినిపిస్తూ వున్నాయి. "శాస్త్రిజీ" అని పిలుస్తూంది.

అతనికి ఆరాత్రి నిద్రపట్టలేదు. ఏం చేసేటట్టు! మనోహరి అంటే మహమ్మదల్లీ సాహెబుగారికి చాలా ఇష్టం. మొత్తం జనానాలో వున్న యువతు లందరిమీదికంటే ఆమె మీదే ఆయనకు ఎక్కువమోజు. ఈ

సంగతి అందరికి తెలుసు. హతాశ అయిన మనోహరి తనమీద ఏమేమి కొండేలు చెప్తుతుందో! మహమ్మదల్లిగారికి కోపం వస్తే ఎంత కఠినంగానైనా ప్రవర్తించగలరని అతనికి తెలుసు. తన గతి ఏం కానున్నదో!

పదిరోజులు కొలువుకు సెలవుపెడితే తన అపరాధం రూఢి అవుతుందేమోనని భయం వేసింది. రెపరెపకొట్టుకుంటున్న మనస్సును చిక్కబట్టి అలాగే కొలువుకు వెళ్ళాడు. వారం రోజులవరకు అంతా మామూలుగానే జరిగింది. మహమ్మదల్లి సాహెబుగారు తనతో వేదాంత చర్చలు చేస్తూనే ఉన్నారు. తమ కుటుంబ పరిస్థితులు చెప్తుతూనే వున్నారు.

"మొన్న తండ్రిగారు నన్నెందుకు పిలిపించారో తెలుసా శాస్త్రిజీ?"

"సెలవియ్యండి హుజూర్!" అని నసిగాడు శాస్త్రి.

"మామూలు పాటే శాస్త్రిజీ! ఖర్చు తగ్గించుకో మన్నారు."

"తమరేమన్నారు హుజూర్?"

"మామూలుపాటే శాస్త్రిజీ! వీల్లేదన్నాను. నా స్వంత ఖర్చులు తగ్గించుకుంటానన్నాను. పరివారాన్ని మాత్రం తగ్గించడానికి వీల్లేదన్నాను. తగ్గించి ఇంటికి పంపితే వాళ్ళ జీవనోపాధి ఎలా అని అడిగాను ఇన్నాళ్ళూ మనలను కనిపెట్టుకొని వున్నవాళ్ళను వీధుల్లోకి తోలటం, వాళ్ళు తిండిలేక అలమటిస్తూవుంటే పట్టనట్టు చూస్తూ వూరుకోవటం మన వంశానికి శ్రేయస్కరం కాదు అన్నాను. ఎన్నడూ నేను వారి మాటకు ఎదురు చెప్పలేదు శాస్త్రిజీ! ఆనాడు మాత్రం మాటకు మాట అనేశాను." అన్నారు సంతోషంగా భుజాలు తాటిస్తూ.

"తండ్రిగారు ఏమన్నారు హుజూర్?"

"నేను చెప్పిందంతా శ్రద్ధగా విని, 'తగ్గించక తప్పదు' అన్నారు. అప్పుడు నే నేమన్నా ననుకున్నావు శాస్త్రీజీ!"

"ఏమన్నారు హుజూర్!"

"ఇది కోమట్లు చెయ్యవలసిన పని. మహమ్మదల్లీ వంశానికి చెందిన సుల్తానులు చెయ్యవలసిన పని కాదు— అన్నాను. దాంతో శాస్త్రీ! తండ్రిగారు నిర్విణ్ణులై కూర్చునిపోయారంటే నమ్ము. అవట్నే నేను ఒచ్చేశాను."

శాస్త్రికి అసలే భయంగా వుంది. ఏ మాటంటే ఏమవుతుందో అని. "చిత్తం హుజూర్!" అని వూరుకున్నాడు.

మహమ్మదల్లీ సాహేబుగారు కూర్చున్నవారు కూర్చున్నట్లు దిగ్గున లేచి, "ఇవ్వాళ నాకు చాలా ఉల్లాసంగా ఉంది శాస్త్రిజీ! భేర్వా వరసలు వాయించు" అన్నారు.

మామూలుగా శాస్త్రి బృదంగం ప్రారంభించాడు. మామూలుగా వింటూ కూర్చున్నాడు హుజూర్. మామూలుగా తలుపు దగ్గరకు జేరింది మనోహరి. జరిగిన విషయం ఏరూపంలోనూ హుజూర్‌కి చెప్పలేదని నిశ్చయించుకొని మనస్సులో వందనాశతా లర్పించాడు శాస్త్రి.

కాని మరునాడు కొలువుకిరాగానే, మేనేజరు పిలిపించి తనకు ఖరారైన ఒక ఫిర్యాదు చూపించాడు శాస్త్రికి. అది శాస్త్రిమీద నీలకంఠ శర్మ ఇచ్చిన ఫిర్యాదు. నీలకంఠశర్మ శాస్త్రికి ముందు హుజూరువారికి సన్నిహితంగా ఉంటున్న ఉద్యోగి. శాస్త్రి వచ్చిన తరువాత హుజూర్ వారిదగ్గర తన ప్రాముఖ్యత తగ్గిందని శాస్త్రిమీద కక్ష పట్టి ఉన్నటువంటి వాడు. శాస్త్రికీ, మనోహరికీ మధ్య జరిగిన సంగతి ఆయనకు యెట్లా తెలిసిందో, చిలువలు పలవలుగా వర్ణించి మేనేజరుకి ఒక ఫిర్యాదు రాసి ఇచ్చాడు, తారీఖు ఉదహరించి, ఆనాడు శాస్త్రీ, మనోహరీ మాంసం తిని, మద్యం త్రాగి, క్రీడించారని ఆ ఫిర్యాదు సారాంశం.

అది చదువుకొని శాస్త్రి హడలిపోయాడు. "ఒట్టిది హుజూర్, వొట్టిది. గాయత్రి పట్టుకు చెపుతున్నాను" అన్నాడు.

"ఒట్టిదే, ఆ సంగతి నాకు తెలుసు. మనోహరికి కావలసివొస్తే వొక్క బ్రాహ్మడివి నీకంటే యెవ్వరూ దొరక్క పోయారా! కాని హుజూరు వారివద్ద వొట్టిదని నిరూపించటం ఎలా?వారు వొట్టిది; అనుకుంటే వొట్టిది. గట్టిది అనుకుంటె గట్టిది. అందులో వారికి మనోహరి అంటే యిష్టం. ఏమి కానున్నదే యేమో!నిన్ను ప్రవేశపెట్టినందుకుఈ పాపం నా మీదవిరుచుకు పడుతుందో యేం ఖర్మో.ఏమన్నా కానీ ఈ పూట హుజూరు వారికి ఈ కాగితం పంపించక తప్పదు. నువ్వెళ్ళి కనపడు" అన్నాడు మేనేజరు.

శాస్త్రి గుండెలో రాయిపడింది. తన వుద్యోగం ఊడినట్లే భావించాడు. శిక్షించటం అనేది వొస్తే కొరడా దెబ్బలదాకా వెళ్ళవచ్చు. ఇటువంటి విషయాల్లో తను ఎన్ని చెప్పుకుంటే మాత్రం హుజూర్ మనస్సుకు ఎక్కుతుంది. ఏమీ తోచక అటూ ఇటూ తిరిగి, ఎనిమిది గంటలకు వెళ్ళాడు హుజూర్ దర్శనార్ధం. అప్పటికి కాగితం హుజూర్ దగ్గరకు వెళ్ళి వుంటుందని అతనికి తెలుసు

అతన్ని చూడగానే, 'రా, శాస్త్రీజీ' అన్నాడు మహమ్మదల్లీ సాహేబుగారు.

"హిందూ అవతారాలన్నిటిలోకి నాకు శ్రీకృష్ణ పరమాత్మ బాగా నచ్చాడు శాస్త్రీజీ" అన్నారు.

"చిత్తం హుజూర్, వారు సాక్షాత్తూ భగవంతులు" అన్నాడు శాస్త్రి.

"నువ్వు పొరపాటుపడుతున్నావు శాస్త్రీజీ! అందరు అవతార మూర్తులవలె వారిలోనూ భగవదంశ యెక్కువగా వుంది, అంతే. వారు రక్తిలోనే విరక్తిని చూశారు. రక్తిని నొదులుకొనీకాదు; రక్తిద్వారానూ కాదు. రక్తిపట్లవుండే వ్యామోహాన్ని రద్దు చేసుకోటానికి రక్తిని అలవాటు చేసుకోవడమే ఉత్తమమార్గమని శ్రీకృష్ణ పరమాత్మ జీవితం హెచ్చరిస్తూ వుంది. ఏమంటావ్ శాస్త్రి?" అన్నారు మహమ్మదల్లి సాహెబుగారు.

శాస్త్రి ఏమంటాడు? హుజూర్ ఈ విషయం ఎందుకు ప్రస్తా విస్తున్నదీ తెలియక తికమకపడుతూ చేతులు జోడించి నిలబడ్డాడు తన సంగతి కాదు గదా! తన్ను ఎత్తి పొడవటం లేదుగదా!

ఏదియినా అడగగానే ఏదో ఒక సమాధానం చెప్పకపోతే హుజూర్‌కి కోపం వస్తుంది. అందుకని, "తమరు చెప్పిన విధంగా కాకపోతే శ్రీకృష్ణపరమాత్మ పదహారు వేలమంది గోపికలతో ఉండటానికి అర్థం చెప్పుకోలేం హుజూర్" అన్నాడు.

"సెహబాస్ శాస్త్రిజీ, బాగా చెప్పావు. నేను చెప్పిన మాట స్వానుభవంమీద చెప్పినమాట. శాస్త్రిజీ, నాకీనాడు ఏ స్త్రీ మీదా వ్యామోహం లేదంటే, నాకున్న జనానాయే కారణం. నా కిప్పుడు స్త్రీమీదే కాదు; అభిజాత్యంమీదే వ్యామోహంలేదు. వ్యామోహం అనేది అందని వస్తువుమీద వుంటుంది. ఆ వ్యామోహం పోగొట్టుకోటానికి ఆయా వస్తువు లను లభ్యపరచుకోవటమే ఉత్తమ మార్గం" అన్నారు మహమ్మదల్లి సాహెబుగారు.

"చిత్తం హుజూర్" అని గొణిగాడు శాస్త్రి.

అంతలో మహమ్మదల్లి సాహెబుగారు ఆలోచనలో పడిపోయారు. మాట్లాడుతూ మాట్లాడుతూ నిద్రపోవటం, ఆలోచనలో పడిపోవటం వారికి మామూలే. వారికి అసలు విషయం ప్రస్తావించే అవకాశం లేదని గ్రహిం చాడు శాస్త్రి. లోపల వేదన సుళ్ళుకట్టి తిరుగుతూవుంది. భరించటం అతనికి అశక్యమైంది. తనకు తానుగానే కదిలించి హుజూర్ మనస్సుని తెలుసు కోవాలనుకున్నాడు. కాలం గడిచినకొద్దీ సాక్ష్యాలూ,మరికొన్ని అపవాదులూ హుజూర్ వారి చెవిని పడటం జరుగుతుందని అతనికి తెలుసు. అతనికి భయం.

"హుజూర్, నా మీద వొక ఫిర్యాదు వొచ్చిందని విన్నాను" అన్నాడు వినయం పుట్టిపడేటట్లు.

"అవును శాస్త్రీజీ! నువ్వు చేసినపని ఏమంత మంచిది కాదు.

అందులో మనోహరి అంటే నాకు మనస్సని నీకు తెలుసుగదా! విశ్వాస పాత్రులు చెయ్యవలసిన పని కాదది" అన్నారు మహమ్మదల్లీసాహెబుగారు.

"నే నేపాపం యెరుగను హుజూర్?" కంటతడి పెట్టుకుంటూ చెప్పాడు శాస్త్రి.

"దీనికి నీమాటేగదా సాక్ష్యం శాస్త్రిజీ!"

"ఇటువంటి విషయాల్లో వేరు సాక్ష్యాలు ఏముంటయ్ హుజూర్?"

"నీవే అపరాధివి, నీవే సాక్షివి. బాగుంది శాస్త్రీజీ. సర్వం ఆ పరబ్రహ్మస్వరూపమే-అవ చెప్పటానికి మంచి తార్కాణం" అని వెంటనే నీలకంఠశర్మను పిలిపించారు.

"శర్మాజీ, ఈ ఫిర్యాదు చేసింది మీరేనా?"

"చిత్తం హుజూర్" అన్నాడు శర్మ.

"ఇందులోని విషయాలు నిజమేగా శర్మాజీ?"

"అక్షరాలా నిజం హుజూర్."

"ఆనాడు శాస్త్రిజీ, మనోహరీకలిసి మాంసంతిన్నారు, మద్యం త్రాగారు. క్రీడించారు. ఇదేకదూ నువ్వు చెప్పేది శర్మాజీ!"

"అంతేకాదు హుజూర్. సర్కారువారు ప్రత్యేకంగా వాడుకునే అత్తర్లు వాడారు. సర్కారువారు ప్రత్యేకం ధరించే పూలమాలలు ధరించారు."

"సరే" అన్నారు మహమ్మదల్లీ సాహెబుగారు. ఇక శాస్త్రిని ఏమీ అడగలేదు. శాస్త్రి పడబోయే పిడుగుకు బద్ధలవటానికి సిద్ధపడుతున్నాడు.

మహమ్మదల్లీ సాహెబుగారు, జనానా హెడ్ నౌకరుని పిలిపించారు.
"మనోహరి ఎక్కడుంది?" అడిగారు.

"ఆమె గదిలోనే వుంది సర్కార్!" అన్నాడు హెడ్ నౌకరు.

"ఆమె గదిలోకి నేను తినే మాంసం, నేను త్రాగే మద్యం తీసుకొని వెళ్ళి పెట్టు. ప్రతీదీ పుష్కలంగా వుండాలి."

"చిత్తం హుజూర్" అని హెడ్‌నౌకరు వెనుతిరిగాడు. అతన్ని మళ్ళీ పిలిచి, "నేను వాడే అత్తర్లూ పూలమాలలు కూడా.ఆమెను చక్కగా అలంకరింటుకొని వుండమను!" అన్నారు మహమ్మదల్లీగారు.

"చిత్తం హుజూర్" అని వెళ్ళిపోయాడు హెడ్‌నౌకరు.

"శాస్త్రిజీ!" అని గద్దించి, "నువ్వు తక్షణం మనోహరి గదికి వెళ్ళు. అక్కడ మాంసం వుంటుంది; మద్యం వుంటుంది; అత్తర్లు వుంటై; పూలమాలలు వుంటై. ఆమె గదికి నేను వెళ్ళేటప్పుడు ఏమేమి ఉంటయ్యో అవన్నీ వుంటయ్. ఆమె నన్ను ఆహ్వానించేటప్పుడు చేసుకునే అలంకారాలన్నీ చేసుకొని వుంటుంది. ఆమె గది ప్రవేశించి అక్కడ వున్న వస్తువుల నన్నిటినీ సేవించి, అత్తర్లు పులుముకొని పూలమాలలు ధరించి, ఆమెపట్ల నేను ఆ సమయంలో ఏ విధంగా ప్రవర్తిస్తానో ఆ విధంగా ప్రవర్తించు; వెళ్ళు" అన్నారు.

శాస్త్రి నిలువుగుడ్లు వేసి, వొణికిపోతూ, "హుజూర్" అని ఏదో మనవి చేసుకోబోయాడు.

"ఇది నా హుకుం శాస్త్రిజీ" అని గద్దించారు మహమ్మదల్లీ సాహెబుగారు.

శాస్త్రి గజగజ వొణుకుతూ, అధోముఖుడై మనోహరి గదికి బయలుదేరాడు.

అతను అటు తిరగ్గానే మహమ్మదల్లి సాహెబుగారు బిగ్గరగా నవ్వుతూ, "ఇప్పుడేమంటావు శర్మాజీ" అని అడిగారు నీలకంఠం శర్మని.

ఏమంటాడు నీలకంఠం శర్మ.

* * * *

ఇంతవరకు మహమ్మదల్లీ సాహెబుగారికీ తనకూవున్న పరిచయాన్ని నాకు చెప్పి, "వారి దగ్గర చాలా మంచి లక్షణాలున్నాయి. వారికి కాకరకాయ వేపుడూ, కుమ్ములో పెట్టిన దోసకాయ పచ్చడీ అంటే చాలా ఇష్టం. కావలసినప్పుడెల్లా నన్ను అడుగుతుండేవారు, నేను మా ఆవిడతో వాటిని చక్కగా చేయించి తీసుకువెళుతుండేవాణ్ణి" అని కంటతడి పెట్టుకున్నాడు వెంకటరమణశాస్త్రి.

కథంతా విన్న తరువాత, అతను కంటతడి పెట్టుకోవటంలో అర్థం వున్నదని నేను గ్రహించాను. కాని నాకు ఒక విషయం తెలుసుకోవాలని కుతూహలం కలిగింది.

"అయితే శాస్త్రీ, నువ్వు మనోహరి గది ప్రవేశించి ఆమె పట్ల, మహమ్మదల్లీ సాహెబుగారు ప్రవర్తించినట్లు ప్రవర్తించావా?" అని అడిగాను.

"తప్పేముంది? హాజూదువారి హుకుం అనుష్ఠించక పోతే ఉద్యోగం నిలుస్తుందా? పొట్ట గడుస్తుందా?" అని సమాధానం చెప్పాడు శాస్త్రి. చెప్పి, తానింత పొడుం వేళ్ళతో తీసుకొని, నాకు కొంచెం అందించి వొక పట్టు పట్టమన్నాడు; తాను ఘాటుగా పీల్చి వేళ్ళు విదిలించుకున్నాడు.